పల్లెల రోడ్లు అధ్వానం

- రాకపోకలకు తప్పని తిప్పలు
- దెబ్బతిన్న రోడ్లతో అవస్థలు



మంచాలకట్టకు వెళ్లే దారిలో ఇలా..



కొండూరు వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలలో నిలిచిన వర్షపు నీరు

పెంట్లవెల్లి: చిన్నపాటి వర్షాలకే గ్రామీణరోడ్లు దెబ్బతింటున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించడంతో కొన్ని నెలలకే రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. మూడు సంవత్సరాల నుంచి వర్షాకాలంలో ఇదే పరిస్థితి దాపురిస్తోందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన రోడ్లు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయి. అడుగడుగున గుంతలు దర్శనమివ్వడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మోస్తరు వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని కొండూరు. మాధవస్వామినగర్, మంచాలకట్ట, మల్లేశ్వరం వెళ్లే దారిలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు వృద్ధులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆటోలో, ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేందుకు వెనకడుగు వేయాల్సిన దుస్థితి నెలకొంది. పలువురు ప్రమాదాలబారినపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి.

హామీలకే పరిమితం

ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించినప్పుడు రోడ్లకు మరమ్మతు పనులు చేపడుతామని హామీలు ఇవ్వడమేగాని అమలు కావడం లేదు. కొన్నేళ్ల నుంచి పాలకులు హామీలు నీటిమీద రాతలాగే మిగిలిపోతున్నాయని వాపోతున్నారు. ఎన్నిసార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా అప్పుడు ఇప్పుడు అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్పా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుత వర్షాలకే రోడ్లు దెబ్బతిని గుంతలలో నీరు నిలిచింది. గుంతలోతు తెలియక చిన్నారులు కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయి.

దారి పొడవునా వర్షపు నీరే..

మంచాలకట్ట, మల్లేశ్వరం, కొండూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుండా వర్షపు నీరే దర్శనమిస్తోంది. అడుగడుగునా గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచింది. రోడ్లపై వెళ్లేందుకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

కొత్త రోడ్లను నిర్మించాలి



గ్రామం నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్తాం. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలలో నీరు నిలిచింది. రోడ్లపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి కొత్త రోడ్లను నిర్మించాలి.

– బాలరాజు, మంచాలకట్ట

ప్రతిపాదనలు పంపించాం

గుంతలమయమైన రోడ్లను పరిశీలించాం. నూతన రోడ్లు నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. నిధులు మంజూరు అయిన వెంటనే కొత్త రోడ్లు నిర్మిస్తాం.

– రవి, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఊరూరా అవగాహన ర్యాలీ



ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు



లింగాల మండలం అంబట్‌పల్లిలో ..

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎంగంపల్లితో పాటు పలు గ్రామాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరారు.

తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో మంగళవారం అమ్మ మాట– అంగన్‌వాడీ బాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బీపాషా బేగం మాట్లాడుతూ 3 ఏళ్ల నుంచి 5 ఏళ్లలోపు బాలబాలికలను స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీలో ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ వరకు విద్యాబోధనతోపాటు పౌష్టికాహారం అందజేయబడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ శిరీష, తల్లులు, కిషోర బాలబాలికలు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి, దారారం గ్రామాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సునీత, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, స్వరూప, సుజాత, శాంతమ్మ, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



బిజినేపల్లి: పంట రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టడం సరికాదని భారతీయ కిసాన్ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా నూతన రేషన్‌కార్డులు జారీ చేయలేదని దీంతో చాలా మంది రైతులు నష్టపోతారని వివరించారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, సంగిశెట్టిస్వామి, లింగయ్య, ఆంజనేయులు, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పలు నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికి రూ.2 లక్షలు రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జేసీకి వినతి

కోడేరు: డీ–8 కాలువ కింద భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు, మాజీ ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ సీతారామారావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 2017 సంవత్సరంలో మండలంలోని రాజాపూర్, సింగాయిపల్లి, రేకులపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, మైలారం బాదిగదిన్నెల్లో 200 మంది రైతులకుగాను 80 ఎకరాలు భూములు కోల్పోయారని వివరించారు.దాదాపు 10 సంవత్సరాలు కావొస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ భూములు కోల్పోయిన వారందరికి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి

మన్ననూర్: విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో రెండేళ్ల కిందట కొందరు రైతులు కలిసి రూ.50 వేలకు దున్నపోతును కొనుగోలు చేసుకున్నారు. రోజు మాదిరిగా దున్నపోతు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ తీగకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది.

గొర్రెల, మేకల సంత వేలం రూ.4.50 లక్షలు

చారకొండ: మండలంలోని జూపల్లిలో గొర్రెల, మేకల సంత వేలాన్ని మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ప్రమీల, ఎంపీఓ వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి వినోద్‌లు సమక్షంలో నిర్వహించారు. గ్రామ బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన నలుగురు పాల్గొనగా చిల్వేరు మహేష్ రూ.4.50 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గతేడాది వేలం రూ.5.32 లక్షలకు పలికింది. వచ్చే సంవత్సరం మార్చి వరకు వేలం దక్కించుకున్న వారు 9 నెలల పాటు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



కొల్లాపూర్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువులు అలుగులు పారుతున్నాయి. వాగుల్లో నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం 66.04 మి.మీ నమోదైంది. వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో రహదారులు బురదమయంగా మారాయి.

19న చలో కమిషనరేట్



కల్వకుర్తిరూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న చలో కమిషనరేట్ చేపడుతున్నట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు మాసమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలో సీడీపీఓ వెంకటమ్మకు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాసమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జయమ్మ, శోభ, అలివేలు, కవిత, మీన, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: ఈ నెల 19న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం కొల్లాపూర్ ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ స్వాతికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

20న 'కార్డియాక్' శిబిరం



మన్ననూర్: అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 20న కార్డియాక్ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేర్ ఆస్పత్రి హైదరాబాద్ సౌజన్యంతో శిబిరంలో గుండె, నరాలు, ఎముకలకు సంబంధించిన పరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. చెంచుపెంటలు, గూడాలు, తండాలు, గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీలు సంబు శోభ, ప్రణీత, మాజీ ఎంపీటీసీ రాములమ్మ, మాజీ ఉప సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

భూమిపై ఎలాంటి లావాదేవీలు ఉండవు

వెల్దండ: భూ కబ్జాపై సోషల్ మీడియాలో వైరల్ అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో మంగళవారం వార్త ప్రచురితం అయ్యింది. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో సర్వేనెంబర్లు 207, 230, 231, 232, 233, 235, 238లో ఉన్న భూమి కోర్టుకేసులో ఉన్నందున ధరణిలో బ్లాక్‌లిస్టులో ఉన్నాయని అధికారులు తెలిపారు. గతంలోనే సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశామని ఉప్పు బాబురావు పేర్కొన్నారు. అమ్మిన వారే మరల తెరపైకి మా భూమిని తీసుకురావడం సరికాదన్నారు. గ్రామంలోని పెద్దల సమక్షంలోనే మాకు భూమి విక్రయించినట్లు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు.

మహిళల గోరింటాకు సంబరాలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వ బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలను నిర్వహించారు. మహిళలంతా ఒక చోట గుమిగూడి స్వయంగా గోరింటాకు మెహందీని తయారు చేసుకున్నారు. గోరింటాకు పెట్టుకొని విశిష్టతను చాటి చెప్పారు. అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌లో రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఆశాఢమాసంలో గోరింటాకు చేతులకు ధరించడం ఆనవాయితీ అని మహిళా సంఘం నాయకురాలు మిరియాల పావని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మ, రాణి, అనసూయ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంగనూర్‌లో మంగళవారం ఆయ పర్యటించారు. విద్యుత్, తాగునీటి సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఈఈ, ఏఈలకు సూచించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తిలో మొహర్రం పండుగ సందర్భంగా పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ జబ్బార్, ఎండీ ఖాజా, ఎండీ రఫీ, వార్డు మెంబర్ ఖాజా, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోటయ్య, మాజీ ఎంపీటీసీ రమణారావు తదితరులు ఆయనతోపాటు ఉన్నారు.

పాత మిద్దె ఇళ్లలో నివాసం ఉండొద్దు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రమ్యనాగరాజు

కొల్లాపూర్: పాత మిద్దె ఇళ్లల్లో నివాసం ఉండొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. మట్టి మిద్దెల్లో నివసిస్తున్న వారిని కలిశారు. వర్షాకాలంలో పాత మిద్దెల్లో నివాసం ఉండే వారు సురక్షిత నివాసాల్లో ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాల దగ్గరికి వెళ్లొద్దని సూచించారు. ఇనుప స్తంభాలు ఉన్న చోట్ల వాటిని తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని, మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. చైర్‌పర్సన్ వెంట మున్సిపల్ ఉద్యోగులు మన్నెం, భగవాన్, శేఖర్, కోటేశ్వరీ తదితరులున్నారు.

పచ్చిరొట్ట సాగు లాభదాయకం



పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న ఏవో, ఏఈఓ

లింగాల: పచ్చిరొట్ట సాగు పంటలకు లాభదాయకమని ఏఓ నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట(జీలుగ)ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 60 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను అందిస్తుందన్నారు. పచ్చి రొట్ట సాగు చేయడం వలన చౌడు నేలలను సారవంతం చేసుకోవచ్చన్నారు. పూతదశలో ఉన్నప్పుడు భూమిలో కలియన్ని ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పేట్ చల్లితే త్వరగా కుళ్లిపోయి ఎరువుగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల జీలుగు విత్తనాలను విత్తడం వలన 8 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



కల్వకుర్తి టౌన్: పరిసరాలను పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న పలు వసతిగృహాలను ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. విద్యార్థుల మరుగుదొడ్లు, స్నానపుగదులు, కిచెన్‌లు, ఇతర ప్రాంతాలను పరిశీలించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు గౌరారం, రాకొండ, లక్నార, కార్వంగ, చిన్నముద్దునూరు, నడిగడ్డ తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి పీర్ల చావిడి వద్ద యువకులు అలయ్ బలయ్ ఆడారు. మంగళవారం తెల్లవారుజామున చిన్నకాశీం, పెద్ద కాశీం, బారిమాములు, హిమామ్ పీర్లను ఊరేగించారు. భక్తులు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని అప్పాయపల్లి, మల్లొనిచెర్వుతండా, మాడాపూర్, కోమటికుంట, అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న పలు గ్రామాల్లో ప్రస్తుతం జ్వరాలు, విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలు, అక్కడక్కడ డెంగ్యూ వ్యాధుల బారిన పడుతున్నారు. మల్లొనిచెర్వుతండాలో ప్రతి ఇంటిలో ఒకరు విషజ్వరాలతో బాధపడుతున్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ), అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రులకు, ప్రైవేటు ఆస్పత్రులకు బారులు కడుతున్నారు. ప్లేట్‌లేట్స్ బాగా తగ్గిన వారికి సీహెచ్‌సీలో వైద్య సేవలు అందించుటకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. కాగా ప్రతి రోజు సీహెచ్‌సీకి మలేరియా జ్వరాల బారిన పడిన వారు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. సీహెచ్‌సీలో ప్రతి రోజు 150 నుంచి 200 మంది ఔట్ పేషంట్లకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. వ్యాధుల ప్రభావం అధికంగా ఉన్న మల్లొనిచెర్వుండాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు వైద్యధికారి శివశంకర్ తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడమే గాక వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా లేక పోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడం, పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలకు నిలయంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీలలో నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేయడం దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఆంజనేయులు వివరణ కోరగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించామని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల వేళలు మార్చండి

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి నుంచి పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లి, జగన్నాథాపూర్, యాపట్ల, అంబడిపల్లి, లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల సమయాన్ని మార్చాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఆర్టీసీ అధికారులను కోరారు. నాగర్‌కర్నూల్, వనపర్తి డిపోలకు చెందిన బస్సులు ఉదయం 9 గంటలకు రావడంతో సమయానికి స్కూళ్లకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయం వేళలో మార్పులు చేసి ఉదయం 8 గంటలకు, మరో బస్సు 8.30 గంటలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వీరబ్రహ్మ చరిత్ర నాటకం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వెంకటేశ్వర నాట్య కళామండలి(పిరట్వాన్‌పల్లి) ఆధ్వర్యంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తునట్లు కళాకారుడు నిరంజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై నాటికను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

గ్రామాలకు బస్సు పునరుద్ధరణ



పెద్దకొత్తపల్లి: కొంతకాలంగా మారుమూల గ్రామాలైన కొత్తయాపట్ల, చంద్రబండతండాలకు మంగళవారం బస్సును పునరుద్ధరించారు. అచ్చంపేట డిపోకు చెందిన బస్సు ఆయా గ్రామాల మీదుగా కొల్లాపూర్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్, గేమ్యానాయక్, భాస్కర్, హరిసింగ్, వేణుగోపాల్, బాలునాయక్ ఉన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు నామినేటెడ్ పదవి కాకుండా మంత్రి పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంద మల్లికార్జున్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన సేవలకు గుర్తించి వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, అధిష్టానం ఎమ్మెల్యేకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

శ్రీశైలానికి పాదయాత్ర

వెల్దండ: హైదరాబాద్‌లో చిలుకూరి బాలాజీ దేవాలయం నుంచి శ్రీశైలం దేవాస్థానానికి టీడీపీ నాయకుల పాదయాత్ర చేపట్టారు. మంగళవారం పాదయాత్ర వెల్దండ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహా, మండల అధ్యక్షుడు వజ్రలింగం, నాయకులు సింహరెడ్డి, బ్రహ్మ, యాదిలాల్ ఉన్నారు.


ఉచిత వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎర్రగట్టు బొల్లారం, అంజనగిరి, గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి వారి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రశేఖర్, సబ్‌యూనిట్ అధికారి రాంమోహన్, దివాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో మంగళవారం మల్లెపల్లి మల్లయ్యపై అతని భార్య రాములమ్మ, మనువడు అంజనేయులు దంపతులు దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ లెనిన్ పేర్కొన్నారు. ఎనిమిది ఎకరాల పొలాన్ని కుటుంబసభ్యుల పేరిట చేయాలని ఒత్తిడి చేస్తూ దాడి చేసినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారని వివరించారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు పూర్తి విచారణ చేసి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, మల్లేష్, నితిన్ తదితరులు ఉన్నారు.